క్లుప్తంగా

18న సర్వసభ్య సమావేశం

దర్శి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 18వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వసంతరావు నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్నీ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందని చెప్పారు.

పట్టు పరిశ్రమ రైతులకు ప్రోత్సాహకాలు అందించాలి



పట్టు రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

త్రిపురాంతకం: పట్టు పరిశ్రమ ద్వారా అందించే ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మైసూరు సీఎస్ఆర్ సెంటర్ నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు డాక్టర్ ఝాన్సీరాణి, డాక్టర్ మల్లికార్జున్ కోరారు. మండలంలోని మేడపి రైతు సేవా కేంద్రం వద్ద నిర్వహించిన పట్టుపరిశ్రమ రైతుల అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. పట్టు రైతులకు మల్బరి తోటల పెంపకం, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. పట్టు రైతులకు అందుతున్న ప్రోత్సాహకాలు వివరించారు. మార్కాపురం, త్రిపురాంతకం, యర్రగొండపాలెం, పెద్దదోర్నాల, పెద్దారవీడు రైతులు పాల్గొన్నారు. పట్టు పరిశ్రమ అధికారులు శ్రీధర్, సుబ్బారెడ్డి, బెనహర్, ప్రసన్న, సుధారాణి, నాగరాజు, చిన్న, నెమిలయ్య పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన పోలేరమ్మ కొలుపులు



ముస్తాబైన విద్యుత్ ప్రభ



పోలేరమ్మ అమ్మవారు

తాళ్లూరు: మండలంలోని నాగంబొట్లపాలెంలో భక్తిశ్రద్ధలతో తొమ్మిది రోజుల పాటు జరిగిన పోలేరమ్మ కొలుపులు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. గ్రామ ప్రజలు ఐక్యంగా భక్తిశ్రద్ధలతో పూజలు చేసి అనంతరం విద్యుత్ ప్రభ ఏర్పాటు చేశారు. పాటకచేరి నిర్వహించారు. గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డి తేనేటి విందుకు హాజరయ్యారు. గ్రామంలో సామూహిక అన్నదానం చేశారు. అధిక సంఖ్యలో బంధుమిత్రుల రాకతో గ్రామం కోలాహలంగా మారింది.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పెద్దారవీడు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జాన్‌సుందరం మంగళవారం తెలిపారు. మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన రికార్డులు, పూర్తి వివరాలతో హాజరు కావాలని కోరారు. సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రజా సమస్యల గురించి అధికారులకు వివరించి వారి ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని ఎంపీపీ సూచించారు.

పుల్లలచెరువులో రెడ్‌బుక్ రాజ్యాంగం!

- ఏకంగా పోలీస్‌స్టేషన్‌లో సివిల్ పంచాయితీ
- టీడీపీ నేతకు అనుకూలంగా వ్యవహరించిన పోలీసులు
- ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేసిన బాధితుడు



యర్రగొండపాలెం: పుల్లలచెరువు పోలీస్ స్టేషన్‌లో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది. పోలీస్ స్టేషన్‌లోనే పంచాయితీలు పెట్టి టీడీపీ నాయకులకు అనుకూలంగా పోలీసులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. టీడీపీకి చెందిన ఎరువులు, పురుగు మందుల వ్యాపారి గజ్జల్లి భాస్కర్ యర్రగొండపాలెం మండలంలోని కొలుకులకు చెందిన మరో వ్యాపారి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన యక్కలి అప్పారావు నుంచి స్థానిక పుల్లలచెరువు రోడ్డులో ఉన్న 22 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని 2023 మే 25వ తేదీన రూ.20 లక్షలకు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ తర్వాత భూముల ధరలు పడిపోవడంతో ఆ స్థలానికి డిమాండ్ తగ్గింది. కొనుగోలుదారులు ముందుకు రాని నేపథ్యంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని పోలీసుల సహకారంతో తాను పెట్టిన పెట్టుబడికి వడ్డీతో సహ వసూలు చేసుకోవాలని టీడీపీ నాయకుడు భాస్కర్ కుట్రలకు తెరతీశాడు. అనుకున్నదే తడవుగా పుల్లలచెరువు ఎస్సై సంపత్‌కుమార్‌తో సంప్రదింపులు జరిపాడు. లావాదేవీలు ఎంత మాట్లాడుకున్నారో తెలియదు కానీ.. ఎస్సై మాత్రం వెంటనే రంగంలోకి దిగారు. ఈ నెల 7వ తేదీన అప్పారావును పోలీస్ స్టేషన్‌కు పిలిపించుకొని తన సిబ్బందితో ఆయనపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి చేశారు. టీడీపీ నేత స్థలం కొనుగోలు సమయంలో ఇచ్చిన నగదుకు వడ్డీ కలిపి మొత్తం రూ.35,23000కు వివిధ తేదీలతో 3 ప్రాంసరీ నోట్లను భాస్కర్ పేరుతో రాయించారు. అంతేకాకుండా తెల్ల కాగితాలపై సంతకాలు తీసుకున్నారు. ఈ సంఘటనతో తీవ్ర మానసిక క్షోభకు గురైన అప్పారావు సోమవారం ఎస్పీ కార్యాలయానికి వెళ్లి అక్కడ గ్రీవెన్స్‌లో అర్జీ దాఖలు చేశారు. స్పందించిన ఎస్పీ ఏఆర్ దామోదర్ ఈ సంఘటనపై 15 రోజుల్లోగా విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజును ఆదేశించారు. ఈ సివిల్ పంచాయితీ రియల్ ఎస్టేట్ వర్గాలతోపాటు యర్రగొండపాలెం నియోజకవర్గంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

నిరుపయోగంగా డంపింగ్ యార్డులు



దొనకొండలో డంపింగ్ యార్డు



అలంకారప్రాయంగా మల్లంపేట డంపింగ్ యార్డు



కొచ్చెర్లకోటలో నిరుపయోగంగా ఉన్న తొట్లు

దొనకొండ: గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రం నిరుపయోగంగా మారి నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పారిశుధ్య నిర్వహణలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఎంతో కీలకం. గతంలో వీటి నిర్వహణ పూర్తి స్థాయిలో జరుగుతూ గ్రామాలు శుభ్రంగా ఉండేవి. పారిశుధ్య కార్మికుల ద్వారా ప్రతి ఇంటి నుంచి చెత్త రిక్షాల ద్వారా తడి, పొడి చెత్తను విడి విడిగా సేకరించి డంపింగ్ కేంద్రాల్లో తొట్లలో నిల్వ చేసేవారు. తడి.. పొడి చెత్త చెదారం కుళ్లి సేంద్రియ ఎరువుగా తయారు చేసి ఆయా గ్రామాల్లోని రైతులకు విక్రయిస్తారు. మండలంలో 18 పంచాయతీల్లో 18 డంపింగ్ యార్డులు నిర్మించారు. ఆయా గ్రామ సర్పంచ్‌ల ఆదీనంలో రిక్షా కార్మికులు చెత్తను సేకరించేవారు. అలాంటిది నేడు కనుచూపు మేరకు కరువైంది. నేడు కూటమి ప్రభుత్వం వీటి నిర్వహణ గాలికి వదిలేసింది. డంపింగ్ యార్డులు అలంకారప్రాయంగా మిగిలి పోయాయి. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. అంతేకాకుండా దొనకొండ డంపింగ్ యార్డు మందు బాబులకు కేరాఫ్‌గా మారిందని ప్రజలు పెద్ద ఎత్తున విమర్శిస్తున్నారు. రాత్రి వేళల్లో మందు తాగిన మందు బాబులు బీభత్సం సృష్టిస్తున్నారు. ఎన్నో సార్లు పంచాయతీ అధికారులకు తెలియపరిచినా పట్టించుకోలేదని విమర్శలు వస్తున్నాయి. ఈ విషయమై ఎంపీడీఓ వి.వసంతరావు నాయక్‌ను వివరణ కోరగా డంపింగ్ యార్డుల నిర్వాహణ బాధ్యత పంచాయతీలదేనన్నారు. త్వరలో సర్పంచ్‌లకు సమావేశం ఏర్పాటు చేసి చెత్త చెదారాన్ని డంపింగ్ యార్డుకు పంపించే విధంగా చూస్తామని చెప్పారు.

ఐక్య పోరాటాలే కార్మిక హక్కులకు రక్ష



మాట్లాడుతున్న తాండవ రంగారావు

దర్శి: ఐక్య పోరాటాలే కార్మికులకు రక్ష అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో షేక్ కాలేబాషా అధ్యక్షతన జరిగిన సీఐటీయూ మండల 5వ మహాసభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ కూటమి నాయకులు ఎన్నికలకు ముందు ఆశ, అంగన్‌వాడీ, మున్సిపల్, మధ్యాహ్న భోజనం, పంచాయతీ కార్మికులకు వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి దారుణంగా మోసం చేశారన్నారు. హామీలు అమలు చేయడం కోసం సీఐటీయూ కార్మికుల పక్షాన పోరాడుతోందని తెలిపారు. రోజురోజుకూ నిత్యావసర సరుకులు ధరలు పెరుగుతున్నాయని, ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. పదవీ విరమణ బెనిఫిట్స్ అమలు చేయాలని, అసంఘటిత రంగ కార్మికులైన బిల్డింగ్, ఆటో, ముఠా వర్కర్స్‌కు 65 సంవత్సరాలు నిండిన తర్వాత రూ.10 వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రైవేటీకరణ, సరళీకరణ, ప్రపంచీకరణ విధానాలతో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతుందని, ప్రజలు అప్పుల పాలవుతున్నారని, పార్లమెంట్‌లో ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆర్థిక సర్వేలో తెలిపారన్నారు. కార్పొరేట్ల ఆస్తులు పెరిగి దేశంలో అసమానతలు పెరిగిపోతున్నాయని, దేశంలో బిలీనియర్లు 3 సంవత్సరాల క్రితం 104 మంది ఉంటే ఇప్పుడు 200 మందికి పెరిగారని, సంపద కొంతమంది వద్ద పోగుబడి పోవడంతో దేశం అభివృద్ధి కావడం లేదన్నారు. కార్పొరేట్ శక్తులకు పదేళ్లలో 45 లక్షల కోట్ల రాయితీలు ఇచ్చారని, గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేస్తున్న గ్రీన్ అంబాసిడర్స్ 9 నెలల నుంచి వేతనాలు ఇవ్వలేదని విమర్శించారు. వేతనాలు నెలనెలా ఇవ్వకపోతే ఎలా జీవిస్తారని, పనులు ఎలా చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆశా, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, పంచాయతీ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

సీఐటీయూ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. మండల కన్వీనర్‌గా ఉప్పు నారాయణ, కమిటీ సభ్యులుగా షేక్ కాలేబాషా, ఆలూరి ఇస్రాయిల్, గుంటు బాలగురవయ్య, జాలా సుశీలా, బోమ్మిరెడ్డి రత్నకుమారి, గర్నిపూడి జాన్ సామ్యేల్, బాజీ, జయమ్మ, పోరుమామిళ్ల వెంకటేశ్వర్లు, మాధవీలత, ఇత్తడి కోటయ్య, జనరాజపల్లి యోహోషువాలను ఎన్నుకున్నారు. అనంతరం కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, 4 లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, అధిక ధరలు తగ్గించాలని, ప్రైవేటీకరణ ఆపాలని, రైతులకు గిట్టుబాటు ధరల చట్టం అమలు చేయాలని సీఐటీయూ నాయకులు చిట్లా ఆదినారాయణ తీర్మానం ప్రవేశ పెట్టగా సభ్యులందరూ ఆమోదించారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



తాళ్లూరు: విద్యార్థినితో మాత్ర మింగిస్తున్న డాక్టర్ ప్రవీణ్

పుల్లలచెరువు: పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం చేయవచ్చని ప్రభుత్వ వైద్యాధికారి ఎస్.శ్రీనాథ్ అన్నారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అల్‌బెండజోల్ మాత్రలు విద్యార్థులతో మింగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులిపురుగలతో చిన్నారుల్లో అనేక ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, దాని నివారణకు ముఖ్యంగా పరిశుభ్రంగా ఉండాలని చెప్పారు. చిన్నారుల్లో గోర్లు ఉండటంతో వాటిలోకి మట్టి వెళ్లి భోజనం చేసే సమయంలో చేతులు పరిశుభ్రం చేసుకోవాలని పేర్కొన్నారు. కేజీబీవీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లిల్లీప్రకాశ్‌వాణి, ఆరోగ్య సిబ్బంది విద్యార్థులతో మాత్రలు మింగించారు.

తాళ్లూరు: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని తాళ్లూరు, తూర్పుగంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో 9,820 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. వైద్యశాఖ ఆధ్వర్యంలో ఆయా అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయుల సహకారంతో మాత్రలు పంపిణీ చేశారు. తాళ్లూరు పీహెచ్‌సీ పరిధిలో 4,317 మంది విద్యార్థులకు మాత్రల పంపిణీ లక్ష్యంగా వైద్యాధికారి డాక్టర్ పి.ప్రవీణ్, డాక్టర్ రాజేష్ యాదవ్, హెచ్వీ రవి, సిబ్బంది పాల్గొని మాత్రలు పంపిణీ చేశారు. తూర్పుగంగవరం పీహెచ్‌సీ పరిధిలో వైద్యాధికారి డాక్టర్ మౌనిక, డాక్టర్ శ్రీకాంత్‌లు ఆయా పాఠశాలల్లో 5,503 విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ లక్ష్యం కాగా 5231 మందికి పంపిణీ చేసారు. హెచ్ఐఓ చంద్రశేఖర్, పీహెచ్ఎన్ రమణ, హెచ్‌వీ సుశీల, హెచ్ఏ గోపీనాయక్ పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థులతో మాత్రలు మింగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్యాం ప్రసన్నతాంజలితో పాటు ఏఎన్ఎం నాగలక్ష్మి, వెంకటేశ్వరరెడ్డి, నాగమూర్తి, ఫిజికల్ డైరెక్టర్ రామానాయక్ పాల్గొని 736 మంది విద్యార్థులకు మందులు పంపిణీ చేశారు.

పత్తిలో సస్యరక్షణ చర్యలు పాటించాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏవో నీరజ

పుల్లలచెరువు: ఖరీఫ్‌లో సాగు చేసిన పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ విస్తరణాధికారి గోపీకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని నాయుడుపాలెం, చెన్నంపల్లి గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసిన పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ పత్తి పంటలో ముఖ్యంగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పంటలు సాగు చేసిన రైతులు భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు, మందులు వాడుకోవాలని సూచించారు. ఇలా చేస్తే పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి రైతు రసాయనిక ఎరువులు తగ్గించి సేంద్రియ ఎరువులు వాడుకోవాలని చెప్పారు. పత్తి, మొక్కజొన్న పంటలకు ఏ మందులు, ఎరువులు వాడుకోవాలో సూచించారు. ఏఈవో కోటేశ్వరరావు నాయక్, వీఏఏలు హరిజానాయక్, ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: పత్తి పంటలో రసం పీల్చే పురుగులు ఆశించాయని, వెంటనే రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి పంటను కాపాడుకోవాలని ఏవో కె.నీరజ అన్నారు. మంగళవారం మండలంలోని కాశికుంట తండా, మిల్లంపల్లిలలోని రైతు సేవా కేంద్రాల్లో జరిగిన గ్రామసభల్లో ఆమె మాట్లాడారు. పత్తిలో ఆశించిన రసం పీల్చే పురుగుల ఉధృతిని నివారించేందుకు ఇమిడాక్లోప్రిడ్ లేకుంటే థయోమెథోక్సాం లేకుంటే ఫిప్రోనిల్ మందులను వారం వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. పొలం గట్లపై, పొలంలో కలుపు మొక్కలు లేకుండా చూసుకుంటే పత్తిని ఆశించే పురుగుల ఉధృతి తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. పంటలు విత్తుకున్న ప్రతి రైతు తప్పనిసరిగా ఈ- పంటను నమోదు చేసుకోవాలని, ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకంలో రైతులు భాగస్వాములు కావాలని ఆమె కోరారు.

కురిచేడు: మండలంలోని ఆవులమందలో మొక్కజొన్న పంటలో నానో యూరియా, నానో డీఏపీ, సూక్ష్మ పోషకాలపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించినట్లు ఏఓ సంతప్‌కుమార్ తెలిపారు. కల్లూరులో మొక్కజొన్న, వరిలో డ్రోన్ ద్వారా పిచికారీపై ఆత్మ-ప్రదర్శన క్షేత్రాలు నిర్వహించినట్లు చెప్పారు. దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాలాజీనాయక్ మాట్లాడుతూ నానో యూరియా, నానో డీఏపీ వాడితే కలిగే ఉపయోగాలు వివరించారు. ముఖ్యంగా మొక్కజొన్నలో జింక్ లోపం అక్కడక్కడా కనబడుతుందని, దీని నివారణకు జింక్ సల్ఫేట్ రెండు గ్రాములు లీటర్ నీటి కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. పురుగుమందులు డ్రోన్ ద్వారా పిచికారీ చేసుకుంటే తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేయడంతో పాటు మందును కూడా సమర్థంగా వినియోగించవచ్చని తెలిపారు. అనంతరం రైతులకు ప్రదర్శన క్షేత్రంలో భాగంగా ఉచితంగా ఇన్పుట్స్ అందజేశారు. మండల వ్యవసాయాధికారి బి.సంపత్‌కుమార్, ఆత్మ బీటీఎం నాగభూషణం, సిబ్బంది పి.సుధాకర్ పాల్గొన్నారు.

పెద్దారవీడు: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజనలో ప్రీమియం నగదు ఈ నెల 14వ తేదీలోపు చెల్లించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు డి.బాలాజీనాయక్ పేర్కొన్నారు. మండలంలోని మద్దలకట్టలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో ఆయన మాట్లాడుతూ సాగు చేసిన పంటలకు ఫసల్ బీమా సద్వినియోగం చేసుకొని త్వరగా ప్రీమియం చెల్లించాలని కోరారు. సాగు చేసిన పంటను రైతులు కచ్చితంగా ఈ- పంట నమోదు చేసుకోవాలని, అలా చేసుకున్న పంటలు అననుకూల వాతావరణ పరిస్థితుల్లో నష్టపోతే బీమా పథకం వర్తిస్తుందన్నారు. బీమా ప్రీమియం చెల్లించిన పంటల వివరాలను సీజన్ చివర్లో ఈ-పంట నమోదుతో సరిపోల్చుతారన్నారు. బ్యాంక్‌లో రుణం తీసుకున్న రైతు అంగీకారంలో ప్రీమియం ఈ నెల 31వ తేదీ వరకు మినహాయిస్తారని చెప్పారు. బ్యాంక్ రుణం తీసుకోకుండా సాగు చేసిన రైతులు మీ సేవా కేంద్రంలో ప్రీమియం చెల్లించాలన్నారు. కౌలు చేసుకునే రైతులు గ్రామ రెవెన్యూ, వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి పంట సాగు పత్రాలు పొందాలన్నారు. వ్యవసాయాధికారి ఎస్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆధారిత బీమా పథకం కింద పత్తి పంటకు 131 మంది, పీఎం ఫసల్ బీమా పథకం కింద 232 మంది రైతులు ప్రీమియం చెల్లించారని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకంలో డబ్బులు జమ కాని రైతులు రైతు సేవా కేంద్రంలో సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని, వ్యవసాయ పరికరాలు కావాల్సిన రైతులు ముందుగా గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ సునీల్‌నాయక్, వీఏఏ విశ్వనాథ్, రైతులు పాల్గొన్నారు.

ట్రక్ ఢీకొని వృద్ధుడి మృతి

తాళ్లూరు: మినీ ట్రక్ ఢీకొనడంతో ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన తూర్పు గంగవరంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. తూర్పు గంగవరం గ్రామానికి చెందిన అల్లూరి చిన్న వెంకయ్య(61) స్థానిక అయ్యప్ప స్వామి గుడి ఆవరణలో ఆశ్రయం పొందుతున్నారు. కాగితాలు, ఇనుము సేకరించి, వాటిని విక్రయిస్తూ పొట్టపోసుకుంటున్నారు. రోజూ మాదిరిగానే దర్శి-చీమకుర్తి ప్రధాన రహదారి వెంట కాగితాలు, ఇనుము సేకరిస్తున్న సమయంలో వేగంగా వచ్చిన మినీ ట్రక్ చిన్న వెంకయ్యను ఢీకొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. వృద్ధుడికి ప్రాణం ఉందని భావించిన మినీ ట్రక్ డ్రైవర్ హుటాహుటిన స్థానిక పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డిగ్రీతో స్థిరపడేందుకు మంచి కోర్సులు అవసరం

దర్శి: డిగ్రీ విద్యతో స్థిర పడాలంటే మంచి కోర్సులు అవసరమని మాస్టర్ మైండ్ సంస్థ ప్రతినిధులు సతీష్, వెంకట్ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కళాశాల కెరియర్ గైడ్ అండ్ సెల్ మరియు కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కెరియర్ గైడెన్స్‌పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సతీష్, వెంకట్ మాట్లాడుతూ డిగ్రీ తర్వాత ఉద్యోగంలో స్థిరపడాలంటే ఎటువంటి కోర్సులు చేయాలో వివరించారు. సీఏ, సీఎంఏ కోర్సులతో కలిగే ఉపయోగాలు వివరించారు. సంఘ సేవకుడు జీవీ రత్నం, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.ప్రభుదాస్, ఇంగ్లిష్ అధ్యాపకులు డాక్టర్ నగేష్, కామర్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ బి.సౌరిలమ్మ, వైవీ రమణ, జి.రమేష్, తెలుగు అధ్యాపకులు డాక్టర్ గంథం వేణు పాల్గొన్నారు.

పందుల స్వైర విహారం



మురుగు కూపంలో పందులు

దొనకొండ: మండల కేంద్రం దొనకొండలోని అన్ని వీధుల్లో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. నివాసాలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ, రోడ్ల వెంబడి, మురికి కూపాల వద్ద గుంపులు, గుంపులుగా ఉండి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పందుల సంచారంతో ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశాలు ఉన్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు. అంతేకాకుండా చిన్నారులు బయటకు వెళ్లాలంటే హడలి పోతున్నారు. పందులు గుంపులుగా తిరగటంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. దొనకొండ విద్యార్థులు నిత్యం కాలేజీలకు దర్శి వెళ్తుంటారు. దర్శి నుంచి దొనకొండకు వచ్చే సరికి చీకటి పడటంతో పందులు రోడ్లపై సంచరిస్తూ ద్విచక్ర వాహనాలకు అడ్డు రావటంతో విద్యార్థులు కింద పడి గాయపడుతున్నారు. పంచాయతీ అధికారులకు ఎన్నోసార్లు ప్రజలు విన్నవించినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందుల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తిని వివరణ కోరగా గతంలో పందుల పెంపకందారులకు చాలాసార్లు నోటీసులు పంపామని చెప్పారు. పందులు పట్టుకోవటం చాలా రిస్క్‌గా ఉందని చెప్పారు. ఎన్నోసార్లు పట్టుకుని దూర ప్రాంతాలకు పంపించామని పేర్కొన్నారు. పందుల పెంపకందారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని ఆయన వివరించారు.

అథ్లెటిక్స్ పోటీలకు వై.పాలెం విద్యార్థి



విద్యార్థులతో కోచ్ రాజు నాయక్

యర్రగొండపాలెం: జాతీయ స్థాయిలో జరిగే అథ్లెటిక్స్ పోటీలకు యర్రగొండపాలేనికి చెందిన విద్యార్థి ఎంపికయ్యాడు. చీరాలలో జరిగిన 36వ రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో 18 జిల్లాల నుంచి 1400 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో వైపాలేనికి చెందిన డి.ప్రవీణ్ లాంగ్ జంప్‌లో గోల్డ్ మెడల్, ట్రిపుల్ జంప్‌లో సిల్వర్ మెడల్, ఎ.సాంబశివరావు ట్రిపుల్ జంప్‌లో తృతీయ స్థానంలో నిలిచి బ్రౌన్ మెడల్ సాధించాడని కోచ్ రాజు నాయక్ తెలిపారు. ప్రవీణ్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడని, పాండిచ్చేరిలో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున పాల్గొంటాడని చెప్పారు.

చిన్నపాటి వర్షానికే జలమయం



కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం ముందు ఇలా..



బ్యాంకు వీధిలో చేరిన వర్షపు నీరు



సాగర్ కాలువ బ్రిడ్జిపై నిలిచిన వర్షపు నీరు

కురిచేడు: చిన్నపాటి వర్షానికే మండల కేంద్రం కురిచేడులోని పలు వీధులు జలమయవుతున్నాయి. మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి బ్యాంకు వీధి, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయం ముందు డ్రైనేజీ పొంగి పొర్లి జలమయమయ్యాయి. దర్శి రోడ్డులోని నాగార్జున సాగర్ కాలువపై బ్రిడ్జి తటాకంలా మారింది. వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో లోతట్టు వీధులకు డ్రైనేజీలు ఎత్తు లేపి, రోడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.